క్లుప్తంగా

నాణ్యత తప్పనిసరి



ఎండీఎంను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ విజయకుమారి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని డిప్యూటీ ఈఓ విజయ కుమారి అన్నారు. మండలంలోని సత్యవరం ఉన్నత పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పరిశీలించారు. ధరలు పెరిగాయనే నెపంతో నాణ్యత తగ్గితే సహించేది లేదన్నారు. ఉపాధ్యాయుల టీచింగ్ నోట్స్, పాఠ్య ప్రణాళికలను పరిశీలించారు. హెచ్ఎం వకులారత్నమాల, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థి శరణ్యను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ప్రోత్సహించడం అభినందనీయమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సి.హెచ్.విశ్వనాథం అన్నారు. తెంబూరు పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని కోట్ని శరణ్యకు రూ.1,000 నగదు, జ్ఞాపిక, పురస్కారాన్ని ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.సుదర్శన్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. హెచ్ఎంను, విద్యార్థి శరణ్య తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు, వి.మల్లేశ్వరరావు, జి.భాస్కరరావు, ఎస్.రామారావు, పి.రామస్వామి, డి.శ్రీనివాసరావు, ఎస్.మన్మధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంఈఓలు

సారవకోట: జిల్లాలోని పలు కేజీబీవీలలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓలు రమణ, భూలక్ష్మి దరఖాస్తులు స్వీకరించారు. బుడితిలో ఏర్పాటు కానున్న కేజీబీవీ టైపు–4లో ఖాళీగా ఉన్న హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, చౌకీదార్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మంగళవారంతో దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందని ఎంఈఓలు తెలిపారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన



మాట్లాడుతున్న డీఈఈ రవికుమార్

ఆమదాలవలస: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా అందిస్తున్న సోలార్ రూఫ్ టాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎలక్ట్రికల్ డీఈఈ బి.రవికుమార్ అన్నారు. ఆమదాలవలస రూరల్ సెక్షన్ కార్యాలయంలో ఈ పథకంపై సోమవారం అవగాహన కల్పించారు. సొంత ఇల్లు కలిగిన వారు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవటం వల్ల కలిగే లాభాలను వివరించారు. సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు లభిస్తాయన్నారు. రూరల్ ఏఈ బి.రవికుమార్, జేఈ రఘు, సబ్ ఇంజినీర్ మహేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ రామారావు, లైన్‌మన్‌లు రామస్వామి, గోవిందరావు, కృష్ణారావు, వినియోగదారులు పాల్గొన్నారు.

అపార్ నంబర్ కేటాయించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఆధార్ కార్డు మాదిరిగా ఆటోమెటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్టరీ (అపార్) పేరుతో ప్రత్యేక నంబర్ కేటాయించాలని ఎంఈఓ కె.రాంబాబు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఒకటి తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఆపైన చదువుతున్న ప్రతీ విద్యార్థి వివరాలను ఆయా పాఠశాలల యాజమాన్యం విధిగా యూడైజ్ ప్లస్ వెబ్ సైట్‌లో వివరాలు నమోదు చేసి ప్రత్యేక నంబరు కేటాయించాలని సూచించారు. ఇప్పటికే ఈ విధానం వెబ్ సైట్‌లో నిర్వహణ జరుగుతుందన్నారు. ఈ నెల 16, 17వ తేదీలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు ఆయా ఉపాధ్యాయులందరూ విధిగా హాజరుకావాలన్నారు. ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

నల్ల చెరకు సాగు.. ఆదాయం బాగు..

- ఎకరాకు రూ.లక్ష వరకు లాభం
- 50 ఎకరాలలో సాగు చేస్తున్న చెరకు పంట
- గత ఐదేళ్లుగా నల్ల చెరకు సాగు



కొమ్ముసరియాపల్లి సమీపంలో సాగు చేస్తున్న నల్ల చెరకు

సారవకోట: నల్ల చెరకు ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. దీనిని తినేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చుతున్నారు. ఆహారం తిన్న తరువాత ఈ చెరుకు గెడ చిన్న ముక్క తీసుకుంటే జీర్ణక్రియపై బాగా పనిచేస్తుంది. సుగర్ వ్యాధిగ్రస్తులు తీసుకున్నా దీని వల్ల సమస్య ఉండదు. నల్ల చెరుకు పంటను మండలంలోని కొమ్ముసరియాపల్లి, బెజ్జి గ్రామాల రైతులు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు. గత ఐదేళ్ల క్రితం తుని నుంచి ఈ నల్ల చెరుకు విత్తనాలను పోలాకి చంద్రరావు, రంగారావు, పోలాకి కేశవరావు, వేణుగోపాలరావు తోపాటు మరో ఇద్దరు రైతులు తీసుకొచ్చి సాగు చేయడం ప్రారంభించారు. వీరికి లాభాలు బాగా వస్తుండటంతో ఈ గ్రామాలకు చెందిన మరో 120 మంది రైతులు ప్రస్తుతం 50 ఎకరాలలో నల్ల చెరుకు సాగు చేస్తున్నారు. నల్ల చెరకు సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతూ వస్తోంది. ఈ రెండు గ్రామాలు పాతపట్నం మండలం తెంబూరు అసర్ల సాగరానికి ఆనుకుని ఉండటంతో నీటి సదుపాయం ఉంది.

ఒక్కొక్క చెరకు గెడ రూ.40 నుంచి రూ.50..

ఎకరా నల్ల చెరకు సాగు చేసేందుకు విత్తనాలు, ఎరువు, పురుగు మందులతో లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతోంది, వీటిని గెడల లెక్క విక్రయిస్తున్నారు. స్థానికంగా (తెంబూరు, హిరమండలం రోడ్డు పక్కన) ఒక్కొక్క చెరుకు గెడ రూ.30లకు నిత్యం విక్రయిస్తున్నారు. వీటికి పలాస, కాశీబుగ్గ, సోంపేట తదితర ప్రాంతాలలో డిమాండ్ ఉండటంతో అక్కడకు వాహనాలలో తరలిస్తూ.. ఒక్కొక్క చెరుకు గెడను రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. పంట చేతికి వచ్చేందుకు 9 నుంచి 12 వారాలు పడుతుంది. గ్రామాలలో యాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యే సమయానికి పంట దిగుబడి రావడంతో ఆర్థికంగా బాగుంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మహాశివరాత్రి నాడు రావివలస ఎండ్ల మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ రెండు గ్రామాలకు చెందిన రైతులు ట్రాక్టర్లతో చెరకులను తీసుకెళ్లి విక్రయిస్తారు. ఒక్కొక్క ఎకరాకు రూ.లక్ష ఖర్చు పోనూ.. మరో రూ.లక్ష ఆదాయం వస్తుందని అంటున్నారు.



తెంబూరు-హిరమండలం రోడ్డులో చెరకు గెడలు విక్రయిస్తున్న మహిళ (ఫైల్)

ఆదాయం బాగుంది



గత నాలుగేళ్లుగా నల్ల చెరకు సాగు చేస్తున్నాను. ప్రారంభంలో పంటపై సందేహాలున్నా.. ప్రస్తుతం దిగుబడి బాగుంది. ఏడాదికి ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తోంది. స్థానికంగా కొంత విక్రయిస్తూ.. మరి కొంత ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాం.

– పోలాకి కేశవరావు, రైతు, బెజ్జి గ్రామం, సారవకోట మండలం

ఇతర పంటలపై దృష్టి సారించాలి



రైతులు వరి పంటను పండించేందుకు ఆసక్తి కనబర్చడంతో ఇతర పంటలపై దృష్టి పెట్టడంలేదు. నల్ల చెరుకు సాగు చేస్తే ఆదాయం పెరగడంతో పాటు భూసారం పెరుగుతోంది. కొమ్ముసరియాపల్లి, బెజ్జి గ్రామాలలో రైతులు నల్ల చెరకు సాగు చేసి మంచి ఆదాయాలు పొందుతున్నారు.

– కె.సి.హెచ్.వెంకటరావు, ఏఓ, సారవకోట

సాగు నీటికి అవస్థలు



గుండవల్లిపేట వద్ద ఆయిల్ ఇంజిన్ ఉపయోగించి నీటిని అందిస్తున్న రైతులు

నరసన్నపేట: మండలంలోని శివారు గ్రామాల రైతులు సాగు నీటికోసం అవస్థలు పడుతున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంటకు నీరు లేక ఎండుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. నీటి కోసం రాత్రి సమయాల్లో కాలువల వెంబడి తిరుగుతున్నారు. మరికొందరు ఆయిల్ ఇంజిన్లు పెట్టి పొలాలకు నీటిని అందిస్తున్నారు. గుండవల్లిపేట, కోమర్తి, మడపాం, గోపాలపెంట, పోతయ్యవలస, కామేశ్వరిపేట, ఉకలాం, అంబోజీపేట, బుచ్చిపేట, దేవాది, పాలకొండపేట, కొత్తపోతవలస, నర్సింగరాయుడుపేట తదితర గ్రామాల్లో సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. మరో మూడు విడతల్లో నీటి తడులు అవసరమవుతాయని, వంశధార కాలువల ద్వారా నీరు అందించాలని రైతులు కోరుతున్నారు. వర్షం పడితే తప్ప.. కాలువల ద్వారా నీరు రావడం లేదు. వాతావరణ మార్పులతో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నీటి తడులు వరి పంటకు ఎక్కువగా అవసరం అవుతున్నాయి. మరోపక్క అధిక వర్షాలు, తుఫాన్ వస్తుందనే వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికల పట్ల రైతులు అప్రమత్తమవుతున్నారు. రైతులకు నష్ట పెట్టేలా కాకుండా వర్షం అవసరం మేరకు కురవాలని రైతులు వరుణ దేవుడిని కోరుతున్నారు.



సుదూర ప్రాంతం నుంచి పైపు ద్వారా పొలానికి నీటిని అందిస్తున్న దృశ్యం

21 మందికి వైద్య పరీక్షలు

కొత్తూరు: మండలంలోని మాతల పంచాయతీ పరిధి పెనుగోటివాడలో కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు.

21 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో జ్వరాల బాధితులు లేరన్నారు. ఇతర రోగాలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈఓ బుజ్జిబాబు, మలేరియా సబ్ డివిజన్ అధికారి నరసింహ అచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సందీప్

సైకత శిల్పికి అస్వస్థత

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస గ్రామానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి గేదెల హరికృష్ణ ఆదివారం అస్వస్థతకు గురయ్యారని కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఈ స్థితిలో ఉన్న హరికృష్ణను ఆదుకోవాలని దాతలను కోరారు.



చికిత్స పొందుతున్న గేదెల హరికృష్ణ

మెటల్ పరిచారు.. రోడ్డు మరిచారు!



మెటల్ వేసి వదిలేసిన సిద్ధాంతం రోడ్డు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డు నుంచి సిద్ధాంతం మీదుగా సరుబుజ్జిలి మండలం మతలబుపేట గ్రామం వరకు లింకు రోడ్డు నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. సుమారు ఐదు కిలో మీటర్ల పీఆర్ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.2.50 కోట్ల నిధులను విడుదల చేసింది. ఎన్నికల ముందు కొంతమేర రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో పనులు నిలిపివేశారు. ఎన్నికల పూర్తయిన తరువాత రోడ్డులో మెటల్ వేసి వదిలేశారు. పనులు ప్రారంభించి 8 నెలలకు పైగానే అవుతున్నప్పటికీ ఎక్కడి పనులు అక్కడే వదిలేయటంతో ప్రయాణికులు, స్థానికులు అనేక ఇబ్బంది పడుతున్నారు. కృష్ణాపురం, బరటాం, సుమంతాపురం, గడేవానిపేట, సిద్ధాంతం తోపాటు సరుబుజ్జిలి మండలం మతలబుపేట, పెద్ద మాలపేట, తెలికిపెంట, కాగితాపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

భూ ఆక్రమణ పరిశీలన



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ట్రస్టు చైర్మన్ సుగ్గు మధురెడ్డి

పొందూరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలో సర్వే నంబర్ 198లో శాలిహుండం వేణుగోపాలస్వామి ఆలయం ట్రస్టుకు సంబంధించిన విలువైన భూమిలో ఆక్రమణలను ట్రస్టు చైర్మన్ సుగ్గు మధురెడ్డి, దేవాదాయశాఖాధికారులు ప్రసాదుబాబు, దుర్గాప్రసాద్ సోమవారం పరిశీలించారు. జిల్లా దేవాదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్ ఆదేశాలతో ఆక్రమణకు గురైన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆక్రమణ భూమిలో నందల వ్యాపారం నిర్వహిస్తున్న కె.భూలోకను 4 రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించారు. ఎటువంటి అనుమతి లేకుండా ట్రస్టు భూమిలో నిర్మించిన నిర్మాణానికి విద్యుత్ మీటర్‌కు ఇచ్చిన ఎన్ఓసీని రద్దు చేయాలని పంచాయతీ ఈఓ మోహన్‌బాబుకు వినతిపత్రం అందించారు. దీనిపై ఎఫ్ఏసీ తహసీల్దార్ ఆర్.వెంకటేష్‌కు, ఏఎస్ఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ట్రస్టు భూమిని ఆక్రమించిన వ్యక్తిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ట్రస్టు చైర్మన్ మధురెడ్డి తెలిపారు.

ఘనంగా విజయ దశమి



ప్రతిజ్ఞ చేయిస్తున్న బొడ్డేపల్లి కృష్ణారావు

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఉన్న బుద్ధిని విగ్రహం వద్ద సోమవారం అశోక విజయ దశమి వేడుకలను బుద్ధిష్ట సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి కృష్ణారావుతోపాటు పలువురు బోధి సత్య అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అశోక విజయ దశమి వేడుకల విశిష్టతను వివరించారు. అనంతరం నాగపూర్‌లో అంబేడ్కర్ బౌద్ధ దీక్ష సందర్భంగా చేసిన 22 ప్రతిజ్ఞలను కృష్ణారావు చదివి వినిపించారు. దళిత మహాసభ నాయకులు టొంపల తిరుపతిరావు, వడమ శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రామకృష్ణ, రాంబాబు, రాకోటి సింహాచలం తదితరులు పాల్గొన్నారు

కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

నరసన్నపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తున్న వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని, సమస్యలు పరిష్కరించాలని పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీసులను రెగ్యులర్ చేసేందుకు ఉద్దేశించిన జీఓ 114ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు రంగు రిబ్బన్లు ధరించి కళాశాల వద్ద నిరసన తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ సురవరపు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు అధ్యాపకులు హెచ్.ఆనందరావు, లక్ష్మీనారాయణ, జోష్యుల హరిప్రసాద్, దుగ్గివలస రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చారు..

సాక్షి ఎఫెక్ట్

నరసన్నపేట: స్థానిక బజారు వీధిలోని స్టేట్ బ్యాంకు ఎదురుగా మెయిన్ రోడ్డుపై పడిన గుంతను పోలీసులు కంకరతో పూడ్చారు. సాక్షిలో ప్రమాదకరంగా గొయ్యి అనే వార్త సోమవారం ప్రచురితమైంది. దీనిపై ఎస్ఐ దుర్గాప్రసాద్ స్పందించారు. హెచ్‌సీ దాలినాయుడు, మాధవరావులకు వెంటనే తాత్కాలిక పద్ధతిలో పూడ్చాలని సూచించారు. దీంతో వారు స్వయంగా రెడ్ గ్రావెల్‌ను తీసుకువచ్చి గుంతను పూడ్చారు.

పోలీసు సిబ్బందికి వాహనదారులు అభినందించారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి శాశ్వత పద్ధతిన గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



గొయ్యిని కంకరతో పూడ్చుతున్న పోలీసులు

చట్టాలపై అవగాహన అవసరం



సారవకోట: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

సారవకోట: చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సూచించారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మహిళా కమిషన్, సాధికార సంస్థ, న్యాయ సాధికారిత సంస్థల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ మహిళల హక్కులు, రక్షణకు కల్పించబడిన చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. అనేక చట్టాలు మహిళలను ఉద్దేశించి చేయడం జరిగిందని, స్వయం శక్తి సంఘాలలో ఉన్న సభ్యులకు ఈ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమణ మాట్లాడుతూ బాల, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిరక్షణపై అవగాహన కల్పించారు. పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి రోషిణి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ మురళీ కృష్ణమోహన్ ఉన్నారు.

న్యాయసేవలు సక్రమంగా అందాలి..

పాతపట్నం: సమాజంలో నేరాలు చేసి శిక్ష పడి సబ్ జైల్‌లో ఉన్న ఖైదీలకు న్యాయసేవలు క్రమంగా అందేలా చూడాలని జిల్లా న్యాయసేవా సమితి కార్యదర్శి, జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. సోమవారం పాతపట్నం సబ్ జైల్‌లో జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా పాన్ ఇండియా కాంపెయినింగ్ కార్యక్రమం నిర్వహించారు. సబ్‌జైల్‌ను పరిశీలించారు. అక్కడ ఉన్న ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు, న్యాయపరమైన సలహాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలికంగా శిక్ష పడిన దోషులకు న్యాయవాదులు ఉన్నారా, లేదా అన్న అంశంపై జైల్ సూపరింటెండెంట్ రామును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత నేరగాళ్ల రికార్డులను పరిశీలించారు. న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోండి

నరసన్నపేట: సబ్ జైల్లో రిమాండ్ ఖైదీలు న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలు గురించి ఆరా తీశారు. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం కావాలంటే కల్పిస్తామన్నారు. ఇటువంటి వారు స్థానిక మెజిస్ట్రేట్ ద్వారా సమాచారం అందివ్వాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయవాదిని సమకూర్చుతుందన్నారు. స్థానిక న్యాయవాదులు, సబ్‌జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా రికార్డుల నిర్వహణ

హిరమండలం: మహిళా స్వయంశక్తి సంఘాల రికార్డుల నిర్వహణ పారదర్శకంగా, అందరికీ అర్థమయ్యేలా ఉండాలని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని కోరాడ, సుభలయ గ్రామాల్లో సోమవారం స్వయం శక్తి సంఘాల నిర్వహణను పరిశీలించారు. ప్రతీ సంఘం ప్రగతికి పది సూత్రాలను పాటించేలా సిబ్బంది బాధ్యత వహించాలన్నారు.

ప్రతీ స్వయంశక్తి సంఘం తమ సొంత నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. పొదుపు నుంచి అప్పులు ఇస్తే.. తద్వారా వచ్చే వడ్డీ సభ్యులందరికీ చెందుతుందని వివరించారు. ప్రతి సంఘ సభ్యురాలకు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీనిధి బ్యాంకు నుంచి అవసరం మేరకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. క్లస్టర్ కోఆర్డినేటర్ అప్పన్న, వీఓఏలు పాల్గొన్నారు.



సుభలయలో రికార్డులను పరిశీలిస్తున్న ఏపీఎం కూర్మారావు

ఆయాను తొలగించడం అన్యాయం

సారవకోట: మండలంలోని జమచక్రం ప్రాథమికోన్నత పాఠశాలలో 2021 నుంచి ఆయాగా పనిచేస్తున్న పిసిని సావిత్రిని అన్యాయంగా తొలగించారని సర్పంచ్ మెండ సంధ్యారాణి ఆరోపించారు. దసరా సెలవుల తరువాత సావిత్రి యథావిధిగా సోమవారం పాఠశాలకు వెళ్లి పరిసరాలు పరిశుభ్రంగా చేస్తుండగా.. హెచ్ఎం ఆమెను పిలిచి నిన్ను విధుల నుంచి తొలగించామని చెప్పడంతో ఆమె ఆందోళనకు గురైంది. దీనిపై ఎటువంటి నోటీసు ఇవ్వకుండా పాఠశాలలో విధులకు హాజరు కావద్దని చెప్పడం సమంజసం కాదని సర్పంచ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరురాలు అనే నెపంతో ఆమెను ఎటువంటి కారణం లేకుండా తొలగించారని ఆరోపించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

సరుబుజ్జిలి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అగ్రస్థానం వేయడం జరుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని మర్రిపాడు, సుభద్రాపురం, పెద్దవెంకటాపురం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదు, ఎంపీడీఓ ఎం.పావని, నాయకులు పాల్గొన్నారు.

సారవకోట: మండలంలోని అంగూరు, వెంకటాపురం, కిన్నెరవాడ, సత్రాం, అలుదు, తొగిరి తదితర పంచాయతీలలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ కృష్ణమోహన్, ఈఓపీఆర్డీ ప్రభాకరరావు, ఏపీఓ నారాయణరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.14 కోట్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఎం.మన్మధరావు తెలిపారు. పల్లె పండగ సందర్భంగా దళ్లిపేటలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈఓపీఆర్డీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని మాకివలస, అక్కురాడ, చల్లవానిపేట, చిన్నదూగాం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ అప్పలనాయుడు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ, మండల పరిషత్, పంచాయతీల నిధులతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని నేరడి, మెట్టూరు, మెట్టూరు బిట్–1, 2, 3 ఆర్ఆర్ కాలనీ, నీలకంఠాపురం పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణాలకు నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఎంపీడీఓ నీరజ, ఏపీఎం ప్రేమలత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: మర్రిపాడులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్